ఆంధ్రజ్యోతి



1

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025

పొలిటికల్ దసరా



- పంచాయతీ, పరిషత్ ఎన్నికల మర్యాదలు
- ఆశావహుల పిలుపులు.. పలకరింపులు
- పండుగకు వచ్చిన పట్నంవాసుల మద్దతుకు బుజ్జగింపులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

బతుకమ్మ, దసరా సంబురాలకు పట్నం వాసులందరూ పల్లెలకు చేరడంతో సందడిగా మారింది. మద్యం, విందులు, పిండి వంటలతో ఆనందంగా గడుపుతున్నారు.. ఇదిలా ఉంటే గ్రామపంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నిలక షెడ్యూల్ రావడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పల్లెల్లో పండుగ మాత్రం దసరా 'పొలిటికల్'గా మారిపోయింది. పదవీకాలం ముగిసిపోయి నెలలు గడుస్తున్నా ఎన్నికలకు ఎదురుచూస్తున్న వారిలో కొందరికి రిజర్వేషన్లు నిరాశా పరిచినా అవకాశం ఉన్నవారు మరోసారి పోటీకి సిద్ధమయ్యారు. అధికారాలు తారుమారైనా నేపథ్యంలో ప్రతిపక్షంలో చేరిన బీఆర్ఎస్, అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్‌లోని నాయకులు ఎన్నికలపై దృష్టి పెట్టడంతో దసరా పండుగ ఎన్నికల వాతావరణాన్ని తీసుకవచ్చింది. జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 260 గ్రామసర్పంచులు, 2268వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. వీటి పరిధిలో జిల్లా గ్రామీణ ఓటర్లు 3లక్షల 53 వేల 351 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 170772 మంది, మహిళలు 182559 మంది ఉన్నారు. ఇందులో పురుషుల కంటే మహిళా ఓటర్లు 11787 మంది అధికంగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు విడతల్లో, గ్రామపంచాయతీ ఎన్నికలు రెండు, మూడో ఫేజ్‌లో రెండు విడతల్లో నిర్వహించనున్నరు. జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 123ఉండగా, జడ్పీటీసీ స్థానాలు 12ఉండగా, 260 జీపీలు, 2268వార్డులు ఉన్నాయి. మొదటి విడతలో 65 స్థానాలు, 377 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. బోయినపల్లి 11 స్థానా లు, 10 పోలింగ్‌కేంద్రాలు, చందుర్తి 10స్థానాలు, 54పోలింగ్ కేంద్రాలు, రుద్రంగి 5స్థానాలు, 27పోలింగ్ కేంద్రాలు, వేములవాడ అర్బన్ 6 స్థానాలు, 36పోలింగ్ కేంద్రాలు, వేములవాడ రూరల్ 7స్థానాలు, 40పోలింగ్ కేంద్రాలు, కోనరావుపేట 12స్థానాలు, 70పోలింగ్ కేంద్రాలు, ఇల్లం తకుంట 14స్థానాలు, 90పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

రెండో విడతలో 58 స్థానాలు, 332 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తంగళ్ళపల్లి 14స్థానాలు, 77పోలింగ్ కేంద్రాలు, ఎల్లారెడ్డిపేట 13 స్థానాలు, 85పోలింగ్ కేంద్రాలు, వీర్నపల్లి 5 స్థానాలు, 26 పోలింగ్ కేంద్రాలు, ముస్తాబాద్13 స్థానాలు, 75పోలింగ్ కేంద్రాలు, గంభీరావుపేట13 స్థానాలు, 69 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. రెండోఫేజ్‌లో మొదటి విడతలో జీపీలు 137, వార్డులు, పోలింగ్‌కేంద్రాలు 1188 ఉన్నాయి, గంభీరావుపేట జీపీలు 22వార్డులు, పోలింగ్ కేంద్రాలు 202, ముస్తాబాద్ జీపీలు 22వార్డులు, పోలింగ్ కేంద్రాలు 202, తంగళ్ళపల్లి జీపీలు 30, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 252, ఇల్లంతకుంట జీపీలు 35, వార్డులు, పోలింగ్‌కేంద్రాలు 294, కోనరావుపేట జీపీలు 28, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 238ఉన్నాయి. మూడోఫేజ్‌లో జీపీలు 123, వార్డులు, పోలింగ్‌కేంద్రాలు 1080 ఉన్నాయి, వేములవాడ అర్బన్ జీపీలు11, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 86, రుద్రంగి జీపీలు10, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 86, చందుర్తి జీపీలు19, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 174, వేములవాడ రూరల్ జీపీలు17 వార్డులు, పోలింగ్ కేంద్రాలు 174, బోయినపల్లి జీపీలు 23, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 212, వీర్నపల్లి జీపీలు 17, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 132, ఎల్లారెడ్డిపేట జీపీలు 26, వార్డులు, పోలింగ్‌కేంద్రాలు 226 ఉన్నాయి. రిజర్వేషన్లలో మార్పులు వచ్చిననేపథ్యంలో పోటీకి తమ అనుచరులనైనా రంగంలోకి నిలపాలని చూస్తున్నారు. మహిళా రిజర్వేషన్లుగా మారినస్థానాల్లో ఆశావహులు తమ సతీమణి, కూతురు, కోడళ్లను బరిలో నిలపాలనే నిశ్చయంతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం మొదలు పెట్టారు.

పలకరింపులు.. ఆహ్వానాలు

పల్లెల్లో పరిషత్, పంచాయతీ ఎన్నికలతో కొత్త పలకరింపులు, ఆహ్వానాలు అప్పుడే మొదలయ్యాయి. దసరా పండుగకు పట్టణాల నుంచి పల్లెలకు వచ్చిన కుటుంబాలను పలకరిస్తూ తమ ఇళ్లకు ఆహ్వానాలు కూడా పలికారు. మళ్లీ ఓట్లు వేయడానికి పోలింగ్ రోజు రావాలని, అభ్యర్థనలు కూడా మొదలుపెట్టారు. దసరా పండుగ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా ఇంటి పక్కనే ఉన్న పలకరించని అప్పటి సర్పంచ్, వార్డుసభ్యులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ ఆశావహులు ఇప్పుడు అప్యాయత పలకరింపులు పండుగ సందర్భంగా విందులకు ఇళ్లకుఆహ్వానిస్తున్నారు. వంగి వంగి దండాలు పెడుతూ తమవైపు తిప్పుకోవడానికి అన్ని ప్రయత్నాలను మొదలుపెట్టడంతో గ్రామాల్లో దసరాకంటే ఎన్నికల పండుగనే కనిపిస్తోంది. అశావహులు తమ అనుచరులకు దసరా దావత్‌లకు మద్యం, ఇతర ఖర్చులు కూడా సమకూర్చినట్లు తెలిసింది. జోరుగా సామూహిక దావత్‌లు కూడా ప్లాన్ చేశారు.

దసరాకు సర్వం సిద్ధం

- వైభవోపేతంగా సాగిన దుర్గాదేవి శరన్నవరాత్రులు
- పల్లె పల్లెన శమీపూజలకు ఏర్పాట్లు
- మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి...
- నేడు జిల్లా వ్యాప్తంగా రాంలీల

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

దసరా సరదాలు చైతన్యశక్తిని కలిగించడమే కాకుండా ఆధ్యాత్మిక సాధనలో జీవితాలను మలుపు తిప్పుతాయి. చెడును తొలగించి మంచిని వెలిగించే విధిగా దసరా పండుగను జరుపుకుంటారు. దుర్గామాత మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించి లోకానికి మేలు కలిగించిందని గుర్తుగా ఒకవైపు, రాముడు రావణ సంహారం చేసినందుకు గుర్తుగా మరోవైపు విజయదశమిని జరుపుకుంటారు.

మిగతా 4లో..



సిరిసిల్లలో మానేరు తీరంలో రాంలీల(ఫైల్)

'దసరా' విజయాలు చేకూర్చాలి : ఎస్పీ



ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ మహేష్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):దసరా అందరికి విజయాలు చేకూర్చాలని ఎస్పీ మహేష్ బి. గీతే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ముందస్తుగా విజయదశమి సందర్భంగా ఎస్పీ దుర్గాదేవికి పూజలు చేసిన అనంతరం ఆయుధపూజ, వాహన పూజలు చేసి జంబిచెట్టుకు పూజలు చేశారు. విజయదశమి సుఖసంతోషాలు కలిగించాలంటూ జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, సిఐలు కృష్ణ, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై నజర్

● గ్రామ పంచాయతీల్లో మొదలైన సర్వే
● రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల తీరుపై సమాచార సేకరణ
● ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న కార్యదర్శులు


జగిత్యాల మండలం కండ్లపల్లిలో వివరాలు నమోదు చేస్తున్న కార్యదర్శి

జగిత్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మౌలిక వసతులపై ప్రభుత్వం కచ్చితమైన సమాచారాన్ని సేకరిస్తోంది. సర్వే చేపట్టి వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా పొందుపర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనిపై కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా సర్వే బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. గతంలోనే పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లోని రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల వివరాలను ప్రభుత్వానికి తెలియజేసినా కచ్చితమైన సమాచార సేకరణ కోసం ప్రభుత్వం మరోసారి సర్వే చేపడుతోంది. కార్యదర్శులు ప్రభుత్వం కోరిన సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పంచాయతీ పాలన కోసం తీసుకువచ్చిన పల్లె ప్రగతి యాప్‌లోనే కొత్త ఆప్షన్ ఇచ్చి అప్‌డేట్ చేశారు.

● కార్యదర్శులకు అవగాహన..

సర్వేపై జిల్లా పంచాయతీ అధికారి అన్ని జీపీల కార్యదర్శులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వివరాలసేకరణపై అవగాహన కల్పించారు. సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివేదికల తయారీ గురించి వివరించారు. సర్వేకు నిర్దిష్టమైన గడువు విధించకపోయినా, సాధ్యమైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా అధికారులు ఆదేశించారు. యాప్‌లో సమాచారం పొందుపరిచిన తర్వాత ఎంపీడీవోలు, డీపీవో ధ్రువీకరణ అనంతరం నివేదికలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్‌కు అందించనున్నారు. దీంతో గ్రామ పంచాయతీల ప్రస్తుత స్వరూపం, అందుబాటులో ఉన్న వసతులపై ప్రభుత్వానికి కచ్చితమైన అవగాహన రానుంది.

● పంచాయతీల స్వరూపం తెలిసేలా..

భవిష్యత్తులో పంచాయతీలకు కల్పించాల్సిన వసతుల కోసం నిధుల కేటాయింపు, ఇతర అవసరాలకు సర్వే వివరాలు ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ భవనాల తీరు, రోడ్లు, మురుగునీటి కాలువల పరిస్థితి, డంపింగ్‌యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, చెత్త సేకరణ కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రాలీల స్థితిగతులపై అంచనా ఉంటుంది. శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ, పాఠశాల భవనాలకు నిధుల కేటాయింపు, మరుగుదొడ్లు, ప్రహరీలు, తాగునీటి వసతి మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవచ్చు. అదనపు వీధిదీపాల రోడ్డు రవాణావ్యవస్థను, మెరుగుపర్చేందుకు అవకాశం కలుగుతుంది.

● సమాచార సేకరణ ప్రారంభం

జిల్లాలోని 20 మండలాల పరిధిలో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికే పంచాయతీల్లో మౌలిక వసతుల పక్కా సమాచారం కోసం సమాచార సేకరణ ప్రక్రియ మొదలైంది. పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయాలు, వ్యవసాయ సంఘం పశువైద్య ఉప కేంద్రాలు, పాఠశాల భవనాలు, పల్లెప్రకృతివనాలు, వైకుంఠ ధామాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, వీధిదీపాలు, కుళాయిలు, బోర్లు, డ్రైనేజీలు, లింకురోడ్లు, ఇంకుడు గుంతలు, ట్రాక్టర్ ట్రాలీలు, రైతువేదిక, గ్రామ మ్యాప్‌లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాల సేకరణ కేంద్రాలు తదితర వసతులపై సర్వే చేపడుతున్నారు. పల్లె ప్రగతి యాప్‌లోనే జీపీ ఇన్‌ఫ్రాక్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్ అనే కొత్త ఆప్షన్ ఇవ్వగా వివరాలు అందులో పొందుపరుస్తున్నారు. 23 రకాల సమాచారాన్ని సేకరించి అప్‌లోడ్ చేసేలా యాప్‌ను సిద్ధం చేశారు.

పకడ్బందీగా సర్వే

-మదన్‌మోహన్, జిల్లా పంచాయతీ అధికారి



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పల్లెల్లో పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులు సర్వే చేస్తుండగా ఎంపీ వోలు, ఎంపీడీవోలు పర్యవేక్షణ చేస్తున్నారు. గ్రామంలోని వివరా లను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

కన్నుల పండువగా అమ్మవారి తెప్పోత్సవం

శివ నామస్మరణతో మారుమోగిన ఆలయం


రాజన్న ఆలయ ధర్మగుండంలో అమ్మవారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మ వారి తెప్పోత్సవం అత్యంత కన్నుల పండుగగా కొనసాగింది. రాజన్న ఆలయ ధర్మగుండంలో బుధవారం ఆది దంపతులు పడవపైన విహరిస్తుంటే భక్తులు ఓం నమఃశివాయ నామస్మరణలో మునిగి తేలారు. వేములవాడ రాజన్న ఆలయంలో చేపడుతున్న శ్రీదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా పది రోజులపాటు విశేషపూజలు అందుకున్న అమ్మవారు మంగళవాయిద్యాల మధ్య తెప్పోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. అమ్మవారి తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు ఆలయ ధర్మగుండం వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ధర్మగుండం భక్తజన సంద్రంగా మారిపోయి కనిపించింది. తెప్పోత్సవం కార్యక్రమానికి ఈవో రమాదేవి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

రాజరాజేశ్వరి రూపంలో అమ్మవారు

ఛండీ హోమం -పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి అడ్లూరి



ధర్మపురి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారలు రాజ రాజేశ్వరీ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చా రు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. సాయంత్రం యోగా, ఉగ్ర నారసింహ స్వామివారిని పొన్న చెట్టు సేవపై ఊరేగించి రాత్రి వేళలో ఆలయానికి తీసుక వచ్చారు. నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారలకు ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి, చింతామణి చెరువు వద్ద మహా శక్తి సేవా సమితి, తిమ్మాపూర్ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో, ఒజ్జల వీధిలో అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి క్షేత్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన దేవి నవరాత్రోత్సవాల్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించి చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీఎస్పీగా ఉద్యోగం సాధించిన మహేశ్వరికి సీపీ సన్మానం


మహేశ్వరిని సన్మానిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

మానకొండూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ గ్రామానికి చెందిన మోదుంపల్లి మహేశ్వరి గ్రూపు-1లో ర్యాంకు సాధించి డీఎస్పీగా ఉద్యోగం సాధించింది. బుధవారం కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలంను కమీషనర్ కార్యాలయంలో కలిసింది. ఈ సందర్భంగా మహేశ్వరిని సీపీ శాలువాతో సన్మానించి అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గంగాధర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్‌కు ఎంపికైనట్లు ఆర్ట్ టీచర్ రామానుజచారి తెలిపారు. పాఠశాలలో చదువుతున్న తొమ్మిదవ తరగతి విద్యార్థులు శివ, కళ్యాణ్‌లు విజువల్ ఆర్ట్స్ 3డి విభాగంలో చేప ఆకృతికి మండల ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో 3డి విభాగంలో వినాయకుడి ప్రతిమ ఆకర్షనీయంగా తయారు చేయగా కలెక్టర్ పమేలా సత్పతి ప్రశంశలు పొందారు. జిల్లాస్థాయిలో మొదటి విజేతగా ఎంపికై రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు అనిత కుమారి, ఆర్ట్ టీచర్ రామానుజచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళకు విషపు పురుగు కాటు

గంగాధర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో బుధవారం మహిళకు విషపు పురుగు కాటు వేసింది. లక్ష్మీదేవిపల్లికి చెందిన బుజ్జి(40) సాయంత్రం కోళ్లను గూట్లో వేసేందుకు వెళ్లింది. ఇంటి వాకిట్లోకి వచ్చిన విషపు పురుగు మహిళ కాలిపై కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు మహిళను గంగాధర ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా సిబ్బంది కరీంనగర్ వెళ్లాలని సూచించారు.

మొరాయించిన రైల్వేగేటు

గంగాధర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై మంగపేట సమీపంలోని రైల్వేగేటు బుధవారం గంట పాటు మొరాయించింది. వేసిన గేటు ఎంతకు తెరుచుకోకపోవడంతో ప్రధా న రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ మేర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జగిత్యాల నుంచి కరీంనగర్ వైద్యశాలకు రోగులను తరలిస్తున్న మూడు అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుని రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగపేట సమీపంలోని జగిత్యాల వైపు రైల్వేగేటు ఇప్పటికీ ఈ వారంలో మూడుమార్లు మొరాయించింది. అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. బుధవారం 39 గేట్లు పైకి ఎత్తి 2,50,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి మూడు లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 62.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 2,59,397 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల దాడి

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల జిల్లా ప్రధా నాసుపత్రిలో బుధవారం మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన తూర్పాటి శశి (17) అనే బాలుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే శశి మృతి చెందాడని అతడి బంధువులు వైద్యులపై దాడి చేశారు. మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన తూర్పాటి శశి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే శశి మృతి చెందాడని అతడి బంధువులు ఆసుపత్రి పర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు వైద్యులపై దాడి చేశారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

పుణ్యతిథి వేడుకలకు సాయిబాబా ఆలయం ముస్తాబు

కోరుట్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా మరుసటి రోజు నిర్వహించే పుణ్యతిథి వేడుకలకు కోరుట్ల షిరిడీ సాయిబాబా ఆలయం ముస్తాబవు తోంది. ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా నిర్వహించే వేడుకలకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా ఈ సంవత్సరం వేల సంఖ్యలో భక్తులు హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అక్టోబరు 3న ఉదయంఅన్నదాన మహాయజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. పుణ్యతిథి రోజున ఉదయం 5 గంటల నుంచి కాగడ హారతి, 5:30 ఆలయ సంకీర్తన, 6:30 అభిషేకం, 8:30 పతాకారోహణ, గణపతిపూజ, 9:30 కళషాభిషేకం, 10:30 విశ్వకర్మ యజ్ఞం, 11 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 వరకు అన్నదానం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వివిధ సేవా సంస్థ ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించే విధంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక పూజలలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ జువ్వాడి కృష్ణారావు ఏర్పాట్లను పరిశీలించారు.

కరీంనగర్ కమిషనరేట్‌లో దసరా వేడుకలు

కరీంనగర్ క్రైం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో దసరా పండగ సందర్భంగా నిర్వహించిన ఆయుధ, జమ్మి, వాహన పూజ కార్య క్రమాల్లో పోలీసు కమిషనర్ గౌస్ ఆలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు కమిష నర్ మాట్లాడుతూ కమిషనరేట్ ప్రజలకు దసరా పండు గ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(ఏఆర్) భీం రావు, ఏసీపీలు విజయ్ కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రజినీకాంత్, జానీమియా, శ్రీధర్‌రెడ్డి, కిరణ్ కుమార్, పీఐలు శ్రీనివాస్, రాంచందర్‌రావు, సృజన్‌రెడ్డి, బిల్లా కోటే శ్వర్, సరిలాల్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

- సిద్ధిదా అలంకారంలో అమ్మవారి దర్శనం


భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ఆవరణ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులు ముందుగా తలనీలాలు సమర్పించుకుని ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సిద్ధిదా అలంకారంలో అమ్మవారు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో దేవీనవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పదో రోజు బుధవారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో అర్చకులు శ్రీలక్ష్మీగణపతి, శ్రీరాజేశ్వర స్వామివారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారు శ్రీ సిద్ధిదా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో రమాదేవితో పాటుగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


రాజన్న ఆలయంలో శ్రీ సిద్ధిదా అలంకారములో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

కిటకిటలాడిన మద్యం దుకాణాలు


సిరిసిల్లలోని ఓ మద్యం షాపు వద్ద సందడి..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

దసరా అంటేనే ముక్క, మద్యం కిక్కు ఉండాల్సిందే. దసరా పండుగ జోష్ కోసం ఏ ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులతో గడపడానికి ఇండ్లకు చేరుకున్నారు. 50 ఏళ్లలో దసరా. గాంధీ జయంతి ఒకే రోజు రావడం ఇది నాలుగోసారి. గురువారం గాంధీ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలు, మాంసం విక్రయాలపై నిషేధం ఉంది. దసరా వచ్చిందంటే రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా రికార్డ్ స్థాయిలో మద్యం అమ్మకాలు, మాంసం విక్రయాలు జరుగుతాయి. జిల్లాలో గత దసరా పండుగ సందర్భంగా రూ. 5.14 కోట్ల మద్యం విక్రయాలు సాగాయి. .ఈసారి దసరా రోజునే గాంధీ జయంతి కావడంతో ఒకరోజు ముందే బుధవారం జిల్లాలోని మద్యం దుకాణాలు కిటకిటలాడాయి. జిల్లాలోని పెద్దవాళ్ల నుంచి యువకుల వరకు మద్యం కిక్కు కోసం ముందుగానే సమకూర్చుకున్న యువకులు మటన్, చికెన్, ఫిష్ ఎలా అంటూ అల్లాడి పోతున్నారు. మరోవైపు దసరా సందర్భంగా గ్రామాలు, పట్టణాలు గ్రామ దేవతలకు మేకలు, గొర్రెలు పొట్టేలు బలిచ్చి మాంసం వాటాలు వేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈసారి గాంధీ జయంతి సందర్భంగా మాంస విగ్రహాలు చేయవద్దని ముందే నోటీసులు జారీ చేయడంతో విక్రయదారులు తర్జనభర్జనలు పడుతున్నారు

బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా శమీయాత్ర

- వేములవాడలో ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ర్యాలీ


వేములవాడలో ఎడ్లబండ్లపై ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో శమీయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేపీ నాయకులు ఎడ్లబండ్లతో తరలివచ్చారు. ర్యాలీని ప్రారంభించిన ప్రతాప రామకృష్ణ మహాలక్ష్మీ వీధిలోని జమ్మిచెట్టు వరకు ర్యాలీగా ఎడ్లబండ్లపై తరలివెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి రాజన్న ఆలయం వరకు వచ్చారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా వేములవాడలో శమీయాత్రను చేపడుతున్నామని, పట్టణ, మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం

ఇల్లంతకుంట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల కాంగ్రెస్ నాయకులతో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమావేశం అయ్యారు. మానకొండూర్ నియోజకవర్గకేంద్ర కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగినట్లు తెలిసింది. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై నాయకుల అభిప్రాయాలు సేకరించారు. గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న అభ్యర్థులకు టికెట్లు కేటాయించడం జరుగుతుందని, ఎవరికి పార్టీ టికెట్ వచ్చినా అందరు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు నాయకులు తెలిపారు.

వరి పంటపై అడవి పందుల దాడి


అడవిపందుల దాడిలో ధ్వంసమైన వరిపంట

రుద్రంగి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంటలపై అడవి పందులు దాడి చేయడంతో వరి పంట భారీగా దెబ్బతిన్నది. మండల కేంద్రానికి గంగం మల్లేశం అనే రైతుకు చెందిన వరి పంట సూమారు ఎకరం పంటపొలంలో అడవి పందులు దాడి చేయడంతో పంట పూర్తిగా దెబ్బతిన్నదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రాత్రి సమయంలో గుంపులు గుంపులుగా వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి


సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

చందుర్తి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియ మవారిని పాటించాలని ఎంపీడీవో రాధ అన్నారు. చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మోడల్ కూడా కండక్ట్‌పై రాజకీయ పార్టీల నాయ కులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల్లో ఏమి చేయాల్సినవి, చేయకూడనవి ఏంటనేది వివరించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కొన్ని నియమాలను రూపొందించిందన్నారు. ఎన్నికల ప్రచారం మొదలుకొని. పోలింగ్ తేదీ వరకు పార్టీలు, నేతలు ఈ నియమావళికి లోబడి వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. షెడ్యూల్ ప్రకటించిన తేదీ మొదలు ఫలితాలు వెలువడే వరకు ఈ కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో ప్రదీప్ కుమార్, అధికారులు రమాదేవి, కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

- ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రకటన నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు విధిగా ఎన్నికల నియమావళిని పాటించాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీ నాయకులతో బుధవారం ఎన్నికల నియమావళిపై సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేర కు నడుచుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, ఆయా పార్టీల నాయకులు మురళీమోహన్, నారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు

కరీంనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచంద్రరావు అన్నారు. కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు, జడ్పీటీసీ ప్రభారీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక మొదలైందన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికయ్యే చోట్ల జడ్పీటీసీ అభ్యర్థులకు బి ఫాంలు అందిస్తామన్నారు. వార్డు సభ్యుడి నుంచి మొదలుకొని జడ్పీటీసీ వరకు అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేసి అత్యధిక స్థానాలను సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. కేంద్ర నిధులను దారి మళ్లించి గ్రామాల్లో అభివృద్ధి లేకుండా చేశారన్నారు. నాడు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి కల్పించారన్నారు. తాజా మాజీ సర్పంచులు పడిన యాతన వర్ణణాతీతమన్నారు. పంచాయతీలకు కరెంట్ బిల్లులు కూడా కట్టలేని దుస్థితి తెచ్చారన్నారు. కాంగ్రెస్ అనేక వాగ్దానాలు చేసి రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్రం క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తోందన్నారు. ఉచితంగా బియ్యం అందిస్తుందని, కేంద్ర నిధులతోనే పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోపిడీ చేస్తే, కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందన్నారు. బీజేపీ మాత్రం అభివృద్ధిపైనే మాట్లాడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎరువుల పంపిణీ చేతకాక యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఈ మధ్యనే లక్ష మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. బీజేపీని గెలిపిస్తే కేంద్ర నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. 42 శాతం రిజర్వేషన్ల సవరణ అప్పుడే చేస్తే ఈ సమస్య వచ్చేది కాదన్నారు. స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదు కాబట్టే రెండేళ్ల జాప్యం చేశారన్నారు. హైకోర్టు ఆదేశించినందునే తప్పనిసరి పరిస్థితుల్లో ఇష్టం లేకపోయినా ఎన్నికలు నిర్వహిస్తున్నారన్నారు. కేంద్ర నిధుల కోసమే నిర్వహిస్తున్నారన్నారు. బీజేపీ బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందన్నారు. ఎన్నికలు జరగాలన్నదే బీజేపీ అభిమతమని, కోర్టుకు కాంగ్రెస్ నేతలే వెళ్లినట్లున్నారన్నారు. రాజ్యాంగ పరంగా ఎన్నికలు నిర్వహించే బాధ్యతను కాంగ్రెస్ తీసుకోవాలన్నారు. దేశంలో రిజర్వేషన్లకు సంబంధించి వివిధ రాష్ట్రాల్లో అనేక సామాజిక సమస్యలుంటాయన్నారు. రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్రానిదే అన్నారు. రాష్ట్రంలో బీసీఈ ముస్లింలకు సంబంధించినదే అని, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్‌కు మాత్రమే ఆనాడు పరిమితం చేశారన్నారు. కానీ వాళ్లకు రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్నారు. దీనిపై బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోందన్నారు. స్థానిక ఎన్నికలపై కోర్టు ఏ విధంగా స్పందిస్తోందో వేచి చూడాలన్నారు. కోర్టు తీర్పును ముందుగా అంచనా వేయలేమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ అవినీతి పాల్పడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టునూ పూర్తిగా విచారణ చేపట్టాలన్నారు. పార్టీ ఫిరాయింపులకు బీజేపీ వ్యతిరేకమని, ఎవరైనా పార్టీ మారాలనుకుంటే పదవులకు రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్, సిరిసిల్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, గోపి, మాజీ మేయర్ వై సునీల్‌రావు, గౌతంరావు, సుభాష్, బాస సత్యనారాయణరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచంద్రరావు అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బీజేపీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును, అధికారంలో ఉండి అడ్డగోలుగా రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ వ్యవహారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. దేశాన్ని 60 ఏళ్లు ఏలిన కాంగ్రెస్ పార్టీ గ్రామాల అభివృద్ధి కోసం చేసిందేమిలేదని విమర్శించారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలుగా గడిచినా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతుందన్నారు. తెలంగాణలో ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. లోగడ జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే ఎందుకు నిదర్శనమన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ప్రజలు బీజేపీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడానికి పార్టీ శ్రేణులంతా తగిన కృషి చేయలన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, చీఫ్ స్పోక్స్ పర్సన్ ఎన్‌వీ సుభాష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, మాజీ మేయర్ సునీల్ రావు, బాస సత్యనారాయణరావు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీపీఆర్‌వోగా లక్ష్మణ్ కుమార్


లక్ష్మణ్ కుమార్

సిరిసిల్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి పౌర సంబంధాల అధికారిగా, కరీంనగర్ ఏడీ లక్ష్మణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ఇన్‌చార్జి లక్ష్మణ్ కుమార్ విధుల్లో చేరారు.ముందుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ హరితను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. జర్నలిస్టులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి శోభాయాత్ర

కథలాపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం శ్రీవేంకటేశ్వరస్వామి శోభాయాత్ర ఘనంగా జరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి దుర్గామాత మండపం దాకా స్వామివారిని డీజే చప్పుళ్ళతో ఊరేగింపుగా తెచ్చారు. తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏటా గ్రామస్థులకు స్వామివారలకు దర్శనమిస్తుంటారు. పురవీధుల వెంట పల్లకిలో ఊరేగిస్తుండగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, దుర్గామండలి నిర్వాహకులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు : కలెక్టర్

సిరిసిల్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ ఎం హరిత ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండగ ప్రతి ఇంటా ఆనందోత్సాహాలను నింపాలని ఆకాంక్షించారు. దుర్గాదేవి కృపతో అందరూ ఆయురా రోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని, ఈ దసరా అందరికీ విజయాలను చేకూర్చాలని అన్నారు.

నియామకం..

ఇల్లంతకుంట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్ర కురుమ సంఘ అధ్యక్షుడిగా బైరి బాలయ్య ఎన్నికయ్యాడు. సంఘభవనంలో బుధవారం సమావేశం జరిగింది. గౌరవ అధ్యక్షుడుగా ఒగ్గు నర్సయ్యయాదవ్, గౌరవ సలహాదారుగా చెలిమిల్ల కనుకయ్య, ఉపాధ్యక్షులుగా చెలిమిల్ల శ్రీను, మ్యాకల ఐలయ్య, ఏగుర్ల రాము, ప్రధాన కార్యదర్శిగా పర్స అయిలయ్య, సహాయకార్యదర్శులుగా బైరి కనుకయ్య, దయ్యాల రామకృష్ణ, కోశాధికారిగా ఏగుర్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బైరి రాయమల్లు, ఏగుర్ల శ్యాం, చుక్క బాబు, పరాద మల్లయ్య, బైరి చిన్నబాలయ్య, ఆడితం బాలయ్య, బండారి మహేష్, బైరి ముత్తయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరిత


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిత

సిరిసిల్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్, ఎన్నికలఅధికారి ఎం హరిత కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలకు అధికారులు సమాధానం ఇచ్చారు.కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నిక్కచ్చిగా, పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ర్యాలీలు, సభలు, ప్రచారాలు నిబంధనల ప్రకారం, ఎన్నికల ప్రవర్తనా నియ మావళికి లోబడి నిర్వహించుకోవాలని కోరారు. జిల్లాలో రెండు విడ తల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, రెండు, మూడో విడతలో గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో హెల్ప్‌లైన్, ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీపీవో షర్ఫుద్దీన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తీగల శేఖర్‌గౌడ్, రాజన్న, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రావణ వధను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న హిదూ ఉత్సవ సమితి నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెడును దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని మానేరు తీరం బతుకమ్మ ఘాట్ రాంలీల మైదానంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న రావణ సంహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూఉత్సవ సమితి నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దాదాపు 30 సంవత్సరాలుగా హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో వివిధ ఉత్సవాలను నిర్వహిస్తుందన్నారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు బతుకమ్మ ఘాట్ వద్ద హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఊరేగింపుగా వచ్చి స్వామివారు జమ్మికొట్టిన అనంతరం రామ్‌లీల మైదానంలోని రావణాసురుడి బొమ్మను దహనం చేయడం ఉంటుందన్నారు. రావణ సంహారం కార్యక్రమానికి సామాజిక సమరసత ప్రాంత సమన్వయకర్త లింగంపెల్లి ధనంజయ్ ప్రధాన వక్తగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి నాయకులు ఆడెపు రవీందర్, మేర్గు సత్యనారాయణ, గాజుల వేణు, గుడ్ల శ్రీధర్, బైరగోని వెంకన్న, వేముల పోశెట్టి,పోతు శ్రీనివాస్, తాటిపాముల సత్యం, గాజుల సత్యానందం, గోనె మల్లేశం, బొజ్జ శ్రీనివాస్, మేర్గు ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎన్నికల హెల్ప్‌లైన్, ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు

- ప్రారంభించిన అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



హెల్ప్‌లైన్‌లో సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

సిరిసిల్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్, ఫిర్యాదుల కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రారంభించారు. స్థానిక సంస్థల ఎన్నికల హెల్ప్ లైన్, ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు చేశామని సర్పంచ్, వార్డుసభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులకు సలహాలు, సూచనలు అందిస్తారని, ఎన్నికల విషయమై ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో గీత తదితరులు పాల్గొన్నారు.

'చిటికెన'కు సాహితీ మిత్రుల సన్మానం

సిరిసిల్ల, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇటీవల అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రచయిత డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్‌ను డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ జాతీయ సాహిత్య తొలి పురస్కారంతో సన్మానించిన సందర్భంగా బుధవారం సిరిసిల్లలో సాహితీ మిత్రులు సన్మానించారు. కవి రచయిత జూకంటి జగన్నాథం, వెంగళ లక్ష్మణ్ తదితరులు కిరణ్ కుమా ర్‌ను అభినందిస్తూ మరిన్ని రచనలు చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఉత్సవ కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని రాచర్ల కింగ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుర్గామాత ఉత్సవాలకు సహకరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యువజన సంఘం సభ్యులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ముస్తాబాద్, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన ముత్యాల నర్సింహారెడ్డిని మాజీ జడ్పీటీసీ సభ్యులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, షన్నం అనిల్ తదితరులు శాలువాతో సత్కరించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టి విశిష్ట సేవలు అందించిన నర్సింహారెడ్డికి ఏషియన్ ఇంటర్‌నేషనల్ రీసెర్చ్ అకాడమీ నుంచి ఇంటర్‌నేషనల్ ఆచీవ్‌మెంట్ అవార్డ్ డాక్టరేట్‌ను పొందగా నర్సింహారెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు.

వృద్ధుల దినోత్సవం నిర్వహించాలి



సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న వృద్ధుడు, నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధుల దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో సిరిసిల్ల పౌర సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్విహించారు. ముందుగా వయోవృద్ధుడు అంకారపు కృష్ణతో నాయకులు కేక్ కట్ చేయించి స్వీట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధాప్యంలోని తల్లిదండ్రులను కొంత మంది పిల్లలు నిరాదరణకు గురి చేస్తున్నారని అన్నారు. కొడుకులు, కూతుళ్లు ఉండి కూడా తల్లిదండ్రులు అనాథశ్రమంలో చేరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వయోవృద్ధులైన తల్లిదండ్రులను చిన్నపిల్లలతో సమానంగా పోషించాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బియ్యాంకర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చీకోటి అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శి కుసుమ గణేష్, కోశాధికారి చిప్పదేవదాస్, సభ్యులు పోశెట్టి శ్రీరాములు, మల్లేశం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీయాగం..


ఇల్లంతకుంటలో చండీయాగంలో పాల్గొన్న భక్తులు


అవునూర్‌లో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

ఇల్లంతకుంట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండలపాల వద్ద భక్తిప్రపత్తుల మధ్య పూజ కార్యక్రమాలు జరిగాయి. మహిశాసుర మర్దిని అలంకారంలో అమ్మవారు బుధవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఇల్లంతకుంటలోని గంగాధర ఆలయం, హిందువాహిణీ సంస్థ ఆధ్వర్యంలో మహా చండీయాగం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వివిద గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పురోహితులు మూగు నాగరాజుశర్మ, రాజేశ్వరశర్మ, అనూప్‌శర్మ, నాగలింగం, హిందువాహిణీ సంస్థ అధ్యక్షుడు నాగసముద్రాల బాలకృష్ణలతో పాటు భవానీ మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవునూర్‌లోగల దుర్గా యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం కుంకుమ పూజల కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గామాత శరన్నవరాత్సోత్సావాల్లో భాగంగా పెద్దఎత్తున నిర్వహించిన కుంకుమ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి, నక్కదాసరి వి, శ్రీకాంత్, రాజు, సురేశ్, రమేశ్, గణేశ్, క్రాంతి, బాబు, ప్రవీణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రాలతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, దుమాల, అక్కపల్లి తదితర గ్రామాల్లోని దేవీ సన్నిధుల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాచర్లగొల్లపల్లిలోని జమదగ్ని సమేత నాగుల ఎల్లమ్మ ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు కుంకుమ పూజలను ఘనంగా జరిపించారు. అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శినమిచ్చారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్లు కృష్ణహరి, మల్లేశం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, వివిధ పార్టీల నాయకులు దేవీని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన స్వామివారు..

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని శ్రీ సీతా రామచంద్రాస్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా అర్చకుడు గోపాల్‌చారి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం హోమం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారు గరుడ వాహనంపై గ్రామ పుర వీధుల గుండా ఊరేగారు. మహిళలు, యువతీయువకులు, చిన్నారుల కోలాటలు, నృత్యాల నడుమ ముందుకు కదిలారు. మహిళలు మంగళహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. గురువారం స్వామి వారు అశ్వవాహనంపై ఊరేగింపు, తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ ఛైర్మన్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు నారాయణరెడ్డి, నర్సయ్య, హన్మండ్లు, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై శ్రీవారి ఊరేగింపు


హోమం నిర్వహిస్తున్న అర్చక పండితులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం దేవాలయంలో పురోహితులు మూర్తి మంత్ర హోమం నిర్వహించారు. అనంతరం నిత్యపూర్ణహుతి, నివేదన తీర్థప్రసాదాల వితరణ చేశారు. రాత్రి శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామిని హంస వాహనంపై పట్టణ ప్రధాన రహదారుల గుండ ఊరేంగుపు నిర్వహించారు. పట్టణ ప్రజలు హంస వాహనంపై ఉన్న శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం సిబ్బంది, నాయకులు, భక్తలు, అర్చక పండితులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..


గెలుపొందిన జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తున్న కనకరాజు

చందుర్తి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా శ్రీధర్‌బాబు యువసేన అధ్యక్షుడు భీమరాజు కనకరాజు అన్నారు. చందుర్తి మండలం రామన్నపేటలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో భాగంగా గెలుపొందిన విజేతలకు, రన్నర్‌గా నిలిచిన క్రీడాకారులకు బుధవారం బహుమతులను అందజేశారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన భీమరాజు కనకరాజుకు స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్‌ఎస్‌ఎస్ ముందంజ..


సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి ప్రముఖ్

ఇల్లంతకుంట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) :సామాజిక సేవా కార్యక్రమాలలో ఆర్ఎస్ఎస్ ముందుంటుందని కరీంనగర్ జిల్లా కళాశాల విద్యార్థి ప్రముఖ్ మాటూరి లింగమూర్తి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని వైశ్యభవనంలో బుధవారం విజయదశిమి ఉత్సవం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఆర్ఎస్ఎస్ ప్రారంభం అయి వంద సంవత్సరాలు పూర్తి అయ్యిందన్నారు. వ్యక్తి నిర్మాణం, శక్తి ఆరాధన, ధర్మ జీవనమే ఆర్ఎస్ఎస్ మార్గాలు అన్నారు. రాబోవు రోజుల్లో గ్రామగ్రామాన ఆర్ఎస్ఎస్ శాఖలు, జనజాగరణ, హిందు సమ్మేళనాలు నిర్వహించాలన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, 370ఆర్టికల్ రద్దు, రామసేతును కాపాడుకోవడం ఆర్ఎస్ఎస్ సాధించిన విజయాలు అన్నారు. వరదలు, తుఫానులు వచ్చినప్పుడు ప్రజలకు సేవచేయడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘ అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం, ఖండ కార్యవాహ తాటిపెల్లి మహేష్, వ్యవస్థ ప్రముఖ్ కాసుపాక కిషన్, సేవాప్రముఖ్ బొల్లం ధనుంజయ్, ఉపమండల ప్రముఖ్ సార శశికాంత్, వివేకానందసేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ జగన్మోహన్‌రావు, నార్ల రాంకిషన్, ఈదుల రవీందర్‌రెడ్డి, తూముకుంట్ల మోహన్‌రెడ్డి, బత్తిని ఆంజనేయులతో పాటు వివిద గ్రామాల స్వయంసేవకులు పాల్గొన్నారు.

దేశహితమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): దేశహితమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) లక్ష్యమని ఆ శాఖ ఖండ శారీరక్ ప్రముఖ్ నేవూరి శివారెడ్డి అన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా వీర్నపల్లి మండల కేంద్రంలో బుధవారం విజయదశమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయన్నారు. హిందువుల ఐక్యతకు ఆర్ఎస్ఎస్ పాటుపడుతోందన్నారు. రాబోయే రోజుల్లో ఇంటింటి జనజాగరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని ప్రతి ఒక్కరూ విజయవంతానికి కృషి చేయాలని శివారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖండ కార్యవాహ కరుణాకర్, మండల ఉప ప్రముఖ్ ఖాజీబాయి, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ చివరి సంవత్సరంలో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహించిన ఇన్‌స్టంట్ పరీక్షల ఫలితాలను బుదవారం ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్ కుమార్ విడుదల చేశారు. వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.satavahana.ac.in.లో చూసుకోవాలని సూచించారు.

దసరాకు సర్వం సిద్ధం

(1వ పేజీ తరువాయి)

భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పే పండుగల్లో విజయాలకు ప్రతీకగా దసరాను వైభవంగా జరుపుకోవడానికి రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. తొమ్మిది రోజుల పాటు సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో పార్వతి అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. రోజుకో అవతార అలంకరణలో పూజలు నిర్వహించారు. మండల, పల్లెల్లో అమ్మవారి మండపాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అమ్మవారి శోభాయాత్రలో సాయంత్రవేళ శమీ దర్శనం, శమీ పూజలకు జమ్మిచెట్ల వద్ద ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీల్లో, వృత్తి పనివారు ఆయుధాలకు బదులుగా తమ పరికరాలతో పూజలు నిర్వహిస్తారు. కొత్త వ్యాపారాలు, పనులు, దుకాణాలు, ప్రారంభించుకోవడానికి విజయదశమి రోజుకే ప్రాధాన్యత ఇస్తారు. విజయదశమి రోజు ప్రారంభోత్సవాల వల్ల అన్నింటా విజయాలు లభిస్తాయని ప్రజల నమ్మకం.

మార్కెట్‌లో దసరా కొనుగోళ్లు...

విజయదశమి సందర్భంగా మార్కెట్‌కు ప్రత్యేక శోభ వచ్చింది. ఈసారి జీఎస్టీ తగ్గడంతో ప్రజలు ఇంటికి అవసరమయ్యే వస్తువుల కొనుగోళ్లతో పాటు వాహనాల కొనుగోళ్లు చేస్తున్నారు. దసరాకు కావాల్సిన కొత్త బట్టల కోసం షాపింగ్‌మాళ్లు, దుకాణాలు కిటకిటలాడాయి. ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు, వాషింగ్ మెషిన్లు, సెల్‌ఫోన్‌లు, ఫ్రిజ్‌ల అమ్మకాలు కూడా పెరిగాయి. దుకాణదారులు వినియోగదారులను ఆకట్టుకోవడానికి ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నారు. స్క్రాచ్ కార్డుల ద్వారా బహుమతులను కూడా ఇస్తున్నారు.

నేడు రాంలీల

దుర్గా మాత మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించి లోకానికి మేలు కలిగించిందని గుర్తుగా ఒకవైపు, రాముడు రావణ సంహారం చేసినందుకు గుర్తుగా మరోవైపు విజయదశమిని జరుపుకుంటారు.

జిల్లా వ్యాప్తంగా గురువారం రాంలీల కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సిరిసిల్ల మానేరు తీరంలో రాంలీల కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించనున్నారు.